


జనంతో కిటకిటలాడుతున్న పొలతల క్షేత్రం, (ఇన్‌సెట్లో) కల్యాణ వేదికపై కొలువుదీరిన మల్లిఖార్జునస్వామి, అమ్మవారు



మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం కడప జిల్లాలోని శైవక్షేత్రాలు శివనామ స్మరణతో మారుమోగాయి. హరహర మహాదేవ.. శంభో శంకర, ఓం నమఃశివాయ, శివోహం అంటూ భక్తులు శివనామస్మరణలో మునిగిపోయారు. మండుటెండను లెక్కచేయకుండా ఆ బోళాశంకరున్ని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వరుసగా సెలవుదినాలు రావడంతో పిల్ల పాప అందరూ శైవక్షేత్రాల బాట పట్టారు. దీంతో ఆలయాలన్నీ ఎటు చూసినా జనంతో కనిపించాయి. ఇక మహాశివుడి దర్శనానికి వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఆటంకాలు లేకుండా దారి పొడవునా అన్న ప్రసాదాలు, మజ్జిగ, నీళ్లు ఇచ్చి దాతలు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. శైవక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపింది. అయితే పోలీసు బందోబస్తు మాత్రం అంతంత మాత్రమే ఉంది. ముఖ్యమైన పుణ్యక్షేత్రాల్లో కూడా సరైన బందోబస్తు లేకపోవడంతో వలంటీర్లు ఇతర సిబ్బంది శైవక్షేత్రానికి వచ్చే భక్తులను కంట్రోల్ చేయలేక ఇబ్బందులు పడ్డారు. ఇక శైవక్షేత్రాల్లో శివపార్వతుల కల్యాణం కన్నుల పండువగా సాగింది.

హరహర మహాదేవ



పొలతలలో మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



పొలతలలో.. దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు

- శివనామస్మరణతో మారుమోగిన శైవక్షేత్రాలు
- పోటెత్తిన భక్తులు
- దారి పొడవునా అన్నదానాలు
- కన్నులపండువగా శివపార్వతుల కల్యాణం

కడప, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ముఖ్యమైన పుణ్యక్షేత్రాల్లో పొలతల మల్లికార్జునుడి ఆలయం ఒకటి. ఇక్కడికి శివరాత్రి రోజు జిల్లా నుంచే కాదు రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ నుంచి భక్తులు వస్తారు. గురువారం రాత్రి నుంచే పొలతలకు భక్తుల తాకిడి మెదలైంది. శుక్రవారం సాయంత్రానికి భక్తుల సంఖ్య భారీగా పెరిగింది. కమలాపురం ఎమ్మెల్యే రవిరెడ్డి దంపతులు శివపార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అయితే ఇక్కడ పోలీసు బందోబస్తు మాత్రం నామమాత్రంగా కనిపించింది. పొలతలకు జనం పోటెత్తుతారని తెలిసినా అక్కడ బందోబసస్తు లేకపోవడం గమనార్హం. రిమ్స్ ఇతర ప్రాంతాల్లో పనిచేసే సెక్యూరిటీ, వలంటీర్లు ఇతర వారిని బందోబస్తుకు నియమించారు. వీరు పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులను నియంత్రించలేక ఇబ్బందులు పడ్డారు.

సిద్దవటంలోని నిత్యపూజస్వామి కోనకు భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. వీఎన్‌పల్లె మండలంలోని సంగమేశ్వర ఆలయం, చాపాడు మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడాయి. ప్రొద్దుటూరులో శివాలయం, సింహాద్రిపురంలోని భానుకోట సోమేశ్వర స్వామి ఆలయం, పులివెందుల మండలంలోని నామాల గుండు, బద్వేలు మండలంలోని లంకమల ఆలయం, బ్రహ్మంగారిమఠం, కాశినాయన మండలంలోని జ్యోతి క్షేత్రం శివనామస్మరణతో మారుమోగాయి. ఖాజీపేట మండలంలోని నాగనాధీశ్వరకోనకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కొండ ఎక్కి స్వామిని దర్శించుకున్నారు. కడపలో మృత్యుంజయకుంట, గడ్డిబజారు లోని శివాలయం, కాగితాలపెంటలోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం, విశ్వనాథ ఆలయాలకు శుక్రవారం తెల్లవారుజామునుంచే భక్తులు పోటెత్తారు. కలసపాడులోని లింగమయ్యస్వామి కొండకు భక్తులు బారులు తీరారు. ఇక చాలామంది భక్తులు శైవక్షేత్రాల వద్దనే జాగారం చేశారు.

దాతల పెద్దమనసు

శైవక్షేత్రాలకు వచ్చే లక్షలాది భక్తులకు దాతలు పెద్ద మనసుతో అన్న ప్రసాదాలు వితరణ చేశారు. పొలతలకు వెళ్లే భక్తుల కోసం కడప నగర శివారు నుంచి ఆలయం వరకూ మార్గమధ్యంలో పలుచోట్ల అన్న ప్రసాదాలు, మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లు అందించారు. బస్సులు, ఆటోలు ఇతర వాహనాల్లో వెళ్లే వారికి మజ్జిగ, మంచినీరు అందించారు. విపరీతమైన ఎండ సెగతో ఉన్న ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకున్నారు.

భక్తులతో కిటకిటలాడిన హత్యరాల



భక్తులతో కిటకిటలాడిన హత్యరాల పుణ్యక్షేత్రం

రాజంపేటటౌన్, మార్చి 8: ప్రముఖ పుణ్యక్షేత్రమైన హత్యరాల భక్తులతో కిటకిట లాండింది. శివరాత్రి సందర్భంగా అన్నమయ్య, కడప, నెల్లూరు, తిరుపతి ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు హత్యరాల పుణ్యక్షేత్రానికి చేరుకున్నారు. బాహుదానదిలో స్నానాలు ఆచరించి త్రేతేశ్వరస్వామికి ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకోవడంతో తొక్కిసలాట జరిగింది. బాహుదానదిలో స్నానమాచరించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేకంగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, అతికారి కృష్ణ ఆధ్వర్యంలో రాజంపేట, కడప ప్రాంతాలలో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. అదే విధంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో భక్తుల కోసం ప్రత్యేక అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజంపేట డీఎస్పీ చైతన్య ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

భక్తులతో కిక్కిరిసిన నిత్యపూజస్వామి కోన

సిద్దవటం, మార్చి 8: లంకమల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజ స్వామి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి నిత్యపూజస్వామిని దర్శించుకున్నారు. సిద్దవటం ఈద్గా మైదానం వద్ద ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్టాండు వద్దకు భక్తులు చేరుకొని అక్కడి నుంచి పంచలింగాల వరకు బస్సులో ప్రయాణించి.. పంచలింగాల గుడి వద్ద నుంచి కోనలో కాలినడక నిత్యపూజ స్వామి కోన చేరుకున్నారు. అక్కడ జలపాతంలో స్నానం చేసి.. నిత్యపూజస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఉదయం శివపార్వతుల కల్యాణం చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు దాతలు అన్నదాన కార్యక్రమాలు, మజ్జిగ పంపిణీ చేశారు. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణకు బందోబస్తు ఏర్పాటు చేశారు.



కిటకిటలాడిన పంచలింగాల కోన

కన్నుల పండువగా వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబల కల్యాణం

బ్రహ్మంగారిమఠం, మార్చి 8: బ్రహ్మంగారి మఠంలో రెండు రోజుల నుంచి శివరాత్రి మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబల కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తిలకించారు. ఈ కార్యక్రమంలో దివంగత పూర్వపు మఠాధిపతి వీరభోగవసంత వేంకటేశ్వరస్వామి కుటుంబ సభ్యులు, ప్రస్తుత ఆలయ ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబల కల్యాణ మహోత్సవం

భక్తి శ్రద్ధలతో శివపార్వతుల కల్యాణం

ఈశ్వరీదేవి మఠం ఆలయ ప్రాంగణంలో శివరాత్రి సందర్భంగా శుక్రవారం రాత్రి మఠాధిపతులు వీరకుమారస్వామి దంపతుల ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. దాతలు సుంకు సురేశ్, ఉమాపతి, భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



సంగమేశ్వరుడు



పొలతలలో కిటకిటలాడుతున్న జనం



సంగమేశ్వరుని దర్శనంకోసం క్యూలో నిల్చున్న భక్తులు





ప్రొద్దుటూరులో ప్రత్యేక అలంకరణలో ముక్తి రామలింగేశ్వరుడు, ప్రత్యేక అలంకరణలో అల్లాడుపల్లె వీరభద్రస్వామి

ఎమ్మెల్యే బెదిరింపులపై విచారణ జరపండి

- ఆదేశించిన ప్రధాన ఎన్నికల కమిషన్
- విచారణకు ఆర్‌వో ఉత్తర్వులు

ప్రొద్దుటూరు, మార్చి 8: ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి వైసీపీకి చెందిన 3వవార్డు కౌన్సిలర్ జంబాపురం వెంకటలక్ష్మి ఆమె భర్త మాజీ కౌన్సిలర్ జంబాపురం రామాంజనేయ రెడ్డిలను బెదిరించిన ఘనటపై భారత ఎన్నికల కమిషన్ స్పందించింది. విచారించి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఆ మేరకు కలెక్టర్‌తో పాటు ప్రొద్దుటూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఢిల్లీలోని ప్రధాన ఎన్నికల కమిషన్ నుంచి ఉత్తర్వులు అందాయి. అందులో భాగంగా కౌన్సిలర్ ఇచ్చిన ఫిర్యాదుపై విచారించి ఆమెకు ఎమ్మెల్యే నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ ప్రొద్దుటూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కౌసర్ భాను ఎస్పీకి లేఖ రాశారు. ఆ మేరకు కౌన్సిలర్ వెంకటలక్ష్మి ప్రధాన ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన కాపీని సైతం జతపరిచినట్లు అందులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రొద్దుటూరు పోలీసు అధికారులు కౌన్సిలర్ వెంకటలక్ష్మి, ఆమె భర్త జంబాపురం రామాంజనేయరెడ్డిలను ఎమ్మెల్యే బెదిరించిన సంఘటనపై విచారణ జరుపుతారా బాధితులకు న్యాయం జరుగుతుందా లేదా అనేది వేచిచూడాల్సిందే.

రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జిగా రూపానందరెడ్డి



రూపానందరెడ్డి

రైల్వేకోడూరు/ఓబులవారిపల్లె, మార్చి 8: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జిగా ముక్కా రూపానంద రెడ్డిని నియమిస్తూ శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతితో ముక్కా రూపానందరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన నాయకులు, కార్య కర్తలను కలుపుకుని ముందుకు సాగుతామన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని కోలు కోలేని విధంగా దెబ్బతీసి.. టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించి చంద్రబాబుకు కానుకగా ఇస్తామని తెలిపారు. ప్రజలు ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందా.. చంద్రబాబును సీఎం చేద్దామా అని ఎదురు చూస్తున్నారన్నారు.

ఓబులవారిపల్లె మండలం ముక్కావారిపల్లె గ్రామంలో పుట్టిన రూపానందరెడ్డి అంచలంచెలుగా వ్యాపార రంగంలో అభివృద్ధి చెందుతూ ప్రముఖ పారిశ్రామికవేత్తగా ఎదిగారు. ఈయన వై.ఎస్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా ఉంటూ.. గత ఎన్నికల వరకు ప్రస్తుత వైసీపీ అధినేత వైఎస్ జగన్ సూచనల మేరకు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులుగా పనిచేశారు. గత రెండేళ్లుగా పార్టీలో తగిన ప్రాధాన్యత లేకపోవడంతో ఆ పార్టీకి దూరంగా ఉన్నారు. ఇటీవల టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. నాటి నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న టీడీపీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులను కలుపుకుంటూ రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో టీడీపీ జెండాను ఎగురవేసే దిశగా ముందుకు సాగుతున్నారు. ఈ నేపథ్యంలో రూపానందరెడ్డికి ఉన్న అభిమానులు, అనుచరులు వారి పనితీరును స్థానిక నాయకుల ద్వారా సమాచారం పొంది టీడీపీ అధినేత రైల్వేకోడూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగిస్తూ అధికారికంగా ప్రకటించారు. దీంతో ముక్కా రూపానందరెడ్డి అభిమానులు, టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఆనందంతో సంబరాలు చేసుకున్నారు.

11న ముఖ్యమంత్రి పులివెందుల పర్యటన

పులివెందుల, మార్చి 8: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 11వ తేదీ సోమవారం పులివెందులలో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించనున్నారు. 11వ తేదీ ఉదయం 10.20 గంటలకు కడప విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి బాకరాపురం హెలిప్యాడ్ చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డుమార్గాన నూతనంగా నిర్మించిన బెస్తవారిపల్లె సమీపంలోని డాక్టర్ వైఎస్సార్ జీజీహెచ్‌కు 10.55కు చేరుకుంటారు. 11.35గంటలకు ఆసుపత్రిని ప్రారంభిస్తారు. అనంతరం పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె సమీపంలో నూతనంగా నిర్మించిన బనానా ఇంటిగ్రేటెడ్ ప్యాక్ హౌస్‌కు చేరుకుని 12గంటలకు ప్రారంభిస్తారు. మున్సిపల్ కార్యాలయం సమీపంలో సెక్రటేరియట్ కాంప్లెక్స్‌ను 12.25గంటలకు, 12.35కు డాక్టర్ వైఎస్సార్ జంక్షన్‌ను, 12.40కు బోలేవార్డ్‌ను అనంతరం వైఎస్ జయమ్మ షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తారు. 1.10కి గాంధీ జంక్షన్‌ను, 1.40కి ఉలిమెల్ల లేక్‌ను, 2.05కు ఆదిత్యబిర్లా యూనిట్ (ఫేజ్-1)ను, 2.55కు వైఎస్సార్ మెమోరియల్ పార్క్‌ను ప్రారంభిస్తారు. 3 గంటలకు ఇడుపుల పాయలోని గెస్టుహౌస్‌కు చేరుకుంటారు. 4గంటల వరకు రిజర్వ్. అనంతరం హెలికాప్టర్ ద్వారా కడప విమానాశ్రయం చేరుకుని 4.35గంటలకు విమానం ద్వారా గన్నవరం బయలుదేరి వెళతారు.

అత్యాశతో అధోగతి



కడప నగరంలోని చిన్నచౌకు, మృత్యుంజయకుంట, ఓంశాంతినగర్, శంకరాపురం, అక్కాయపల్లె, ఐటీఐ సర్కిల్, రవీంద్రనగర్.. ఇలా ప్రతి ప్రాంతంలో వీధికొకరు చీటీలు నిర్వహిస్తున్నారు. కడపతో పాటు పలు ప్రాంతాల్లో అనుమతి లేని చీటీలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి వారిలో తరచూ ఎక్కడో ఓ చోట నిర్వాహకులు రాత్రికి రాత్రే పరారవుతున్నారు. అత్యాశతో చీటీలు వేసి, అధిక వడ్డీలకు డబ్బులు ఇచ్చి.. ఆ డబ్బులు తిరిగి రాక.. బాధితులు లబోదిబోమంటున్నారు. తరచూ ఇలాంటి వ్యవహారాలు ఎక్కడో ఓచోట వెలుగులోకి వస్తూనే ఉన్నా.. జనం ప్రైవేటు చీటీలు వేస్తుండటం విశేషం.

- ప్రైవేటు చీటీలతో జేబులకు చిల్లు
- భారీగా డబ్బులు కూడగట్టుకుని టోపీ పెడుతున్న చీటీల నిర్వాహకులు
- తరచూ మోసపోతూనే ఉన్నా.. కొందరిలో మారని తీరు
- పోలీసుస్టేషన్ల గడప తొక్కుతున్న బాధితులు
- ఆధారాల్లేక చర్యలు తీసుకోలేని పోలీసులు
- లబోదిబోమంటున్న బాధితులు

కడప(క్రైం), మార్చి 8: జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల నెల చీటీలు, వారం చీటీలు, రోజు చీటీలు కూడా నిర్వహిస్తున్నారు. కొన్ని చోట్ల నిర్వాహకులు అత్యాశకు పోయి వడ్డీ వ్యాపారం చేస్తూ సభ్యుల డబ్బును ముందస్తు ప్రణాళిక ప్రకారమే ఎగరగొడుతున్నారు. చీటీల పేరుతో వేలు, లక్షలు దాటి కోట్ల రూపాయలు కూడా కోల్పోయిన వారున్నారు. అంతా అయిపోయాక పోలీసుస్టేషన్‌కు రావడం, ఎంతో కొంత ఇప్పించమని పోలీసులను వేడుకోవడం కడప నగరంలో తరచూ జరుగుతోంది.

కొన్ని ఉదాహరణలు

- కడప నగరం చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి చీటీలు నిర్వహిస్తూ వస్తున్నాడు. కొన్ని సంవత్సరాలుగా అందరికీ బాగా నమ్మకంగా ఉన్నాడు. దీంతో చీటీలతో పాటు చాలామంది అత్యాశతో ఆయనకు అధిక వడ్డీలకు డబ్బు ఇచ్చారు. దాదాపు రూ.20 కోట్ల మేర డబ్బులు వసూలు చేసుకుని పరారయ్యాడు.
- ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో పనిచేస్తున్న ఓ మహిళ బంగారు కుదువపెట్టి లోన్ల రూపంలో వారికి డబ్బులు ఇవ్వడంతో పాటు.. అధిక వడ్డీ ఇస్తానంటూ వారి వద్ద నుంచి ఆ డబ్బులు తీసుకునేది. తొలుత అందరికీ డబ్బులు చెల్లించేది. అందరికీ నమ్మకం ఏర్పడ్డాక భారీ మొత్తంలో వసూలు చేసి పరారయింది. డబ్బులు ఇచ్చిన వారికి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో పోలీసుస్టేషన్ చేరుకుని బాధితులు లబోదిబోమన్నారు.
- గతంలో కడప నగరంలోని అక్కాయపల్లెలో భార్య భర్త చీటీలు వేసి కోట్లు వసూళ్లు చేసి ఆపై బోర్డు తిప్పి పరారయ్యారు. డబ్బు కట్టినట్లుగా బాధితుల వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. ఆ వ్యవహారంపై పలువురు తాలుకా పోలీసులను ఆశ్రయించడంతో ఆ దంపతులపై చీటింగ్ కేసు నమోదు చేసి ఇటీవల నిర్వాహకుడిని అరెస్టు చేశారు.
- కడప నగరం నాగరాజుపేటలో ఓ మహిళ రెండు నెలల క్రితం చీటీలు వేసి భారీ ఎత్తున సభ్యుల నుంచి వసూళ్లు చేసుకుని పరారైంది. ఇదే ప్రాంతంలో మరో వ్యక్తి కోట్ల రూపాయల్లో చీటీలు వేసి చివరికి ఐపీ దాఖలు చేసి పరారయ్యాడు.

కడప నగరంతో పాటు పలు చోట్ల ఇలాంటి ఘటనలు రోజూ కనబడుతూనే ఉన్నాయి. బాధితుల వద్ద సరైన ఆధారాలు లేకపోవడంతో పోలీసులు ఇలాంటి ఫిర్యాదులు వచ్చినప్పుడు తలలు పట్టుకుంటున్నారు.

చట్టపరిధిలో భద్రత

చట్టపరిధిలో అనుమతి పొందిన చీటీల్లో డబ్బులు కట్టే సభ్యులకు కచ్చితంగా ఆర్థికపరమైన భద్రత ఉంటుంది. వీటిని నిర్వహించాలనుకుంటే తొలుత రిజిస్టరు కార్యాలయంలో పేరును రిజిస్టరు చేస్తారు. ఎంత చీటీ వేస్తున్నారో ఆ మేరకు బ్యాంకులో డిపాజిట్ చేసి ఆ పత్రాలను చూపిస్తే సదరు కార్యాలయంలో నెంబరు వేసేందుకు అధికారులు అనుమతి ఇస్తారు. ఇలాంటి చీటీ సంస్థల్లో సభ్యులకు మాత్రమే భద్రత ఉంటుంది. అలా కాదని ప్రైవేటు వ్యక్తుల వద్ద చీటీలు వేస్తే భద్రత ఉండదు. చీటీల ద్వారా అధిక మొత్తం వసూళ్లు చేసుకుని పరారు కావడంతో పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితుల సంఖ్య ఎక్కువ అవుతోంది. ఆధారాలు లేకోవడంతో పోలీసులు ఏం చేయలేని పరిస్థితి. ప్రైవేటు చీటీలు, గ్యారంటీ లేని వడ్డీకి ఆశపడి ఎవ్వరూ మోసపోవద్దని పోలీసులు కోరుతున్నారు.

అత్యాశతో నమ్మి మోసపోవద్దు

- షరీఫ్, డీఎస్పీ, కడప

చాలా మంది అత్యాశతో ప్రైవేటు చీటీలు వేసి డబ్బులు పోగొట్టుకుంటూ లబోదిబోమంటున్నారు. ప్రతిసారి ప్రైవేటు చీటీలతో ఇలాంటి మోసాలు జరుగుతున్నా జనంలో మార్పు రావడం లేదు. వీరికి అవగాహన కల్పించినప్పటికీ చీటీ నిర్వాహకులపై ఉన్న నమ్మకం తొలుత వారిచ్చే వడ్డీలతో నమ్మి మోసపోతున్నారు. చట్టపరిధిలో ఉండేదైతే న్యాయం జరుగుతుంది.



చీటీ డబ్బులతో పారిపోయిన వ్యక్తిపై కడప డీఎస్పీకి ఫిర్యాదు చేసి విలపిస్తున్న బాధిత మహిళ (ఫైల్‌ఫోటో)


కొనసాగిన వైసీపీ చీరల పంపిణీ

పెనగలూరు, మార్చి 8 : మండలంలో ఓటర్లకు వైసీపీ నాయకులు తలపెట్టిన చీరల పంపిణీ కార్యక్రమం రెండవ రోజైన శుక్రవారం కొనసాగింది. పల్లంపాడు గ్రామంలో వైసీపీ కార్యకర్తలు మహిళా ఓటర్లకు చీరల పంపిణీ చేశారు. అయితే అధిష్టానం నుంచి రేషన్ కార్డుకు ఒక చీర చొప్పున పంపించారని.. కొందరికి ఇచ్చి కొందరికి ఇవ్వకుంటే ఎలాగని కొంత మంది వైసీపీ ద్వితీయశ్రేణి నాయకులు చీరలను పక్కన పెట్టినట్లు సమాచారం. ఒక్కో ఇంటి లో ఇద్దరు ముగ్గురు మహిళా ఓటర్లు ఉన్నపుడు రేషన్‌కార్డుకు ఒక చీర చొప్పున ఇస్తే ప్రజల్లో వ్యతిరేకత వస్తుందని పక్కన పెట్టినట్లు సమాచారం.



పల్లంపాడులో చీరలు పంపిణీ చేస్తున్న వైసీపీ కార్యకర్తలు

రాజోలి నుంచి కుందూకు నీరు



కుందూనదిలో ప్రవహిస్తున్న నీరు

రాజుపాలెం, మార్చి 8 : వేసవికాలం దృష్టిలో ఉంచుకుని తాగునీటి అవసరాలకు కుందూనదికి నీరందిస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. జిల్లా సరిహద్దులోని రాజోలి ఆనకట్ట వద్ద నుంచి 200 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. 20 రోజులుగా చుక్కనీరు లేక ఎడారిని తలపించిన కుందూలో ఈ నీరు ప్రవహిస్తున్నా గుంతలు నిండుతూ రావడం ద్వారా కడపకు చేరేందుకు మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. కాగా.. నదికి ఆనుకుని ఉన్న బోరుబావుల్లో నీటిమట్టం పెరుగుతుందని, మూగజీవాలకు తాగునీటి అవసరాలకు ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

పేకాట స్థావరాలపై దాడి.. 12 మంది అరెస్టు

కొండాపురం, మార్చి 8: మండలంలోని కొండాపురం, పొట్టిపాడు గ్రామాలవద్ద పేకాట స్థావరంపై శుక్రవారం పోలీసులు దాడులు నిర్వహించారు. కొండాపురం రైల్వేస్టేషన్ వద్ద పేకాట ఆడుతున్న ముగ్గురి నుంచి రూ.19,250, పొట్టిపాడు గ్రామం వద్ద .పొలాల్లో పేకాట ఆడుతున్న 9 మంది నుంచి రూ.1,38,000 స్వాధీనపరుచుకున్నారు. .వీరిని కోర్టుకు హాజరు పరచనున్నట్లు ట్రైనీ డీఎస్పీ శ్రీకాంత్ తెలిపారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

చిన్నమండెం, మార్చి 8: మండలంలోని దిగువగొట్టివీడు గ్రామంలో ఏడుగురు జూదరులను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ రమేశ్‌బాబు తెలిపారు. దిగువగొట్టివీడు గ్రామ సమీపాన జూదమాడుతున్నారన్న సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడిచేసి ఏడుగురిని అదుపులోకి తీసుకుని రూ.11,530 సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



బ్రహ్మంగారిమఠం, మార్చి 8: అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని కొత్తూరు గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ విద్యాసాగర్ వివరాల మేరకు కొత్తూరు గ్రామవాసి ఆకుల ఫణీంద్ర (36) శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇటీవల ఇంటి నిర్మాణం కోసం అప్పులు ఎక్కువ చేశాడని, అవి తీర్చలేనేమోనని మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి తల్లి రాములమ్మ తెలిపారు. ఈ మేరకు ఆమె ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'ఉత్తుత్తి సమావేశాలతో ఉపయోగం లేదు'

కడప (ఎడ్యుకేషన్), మార్చి 8 : ఉద్యోగ సంఘాలతో రాష్ట్ర మంత్రులు ఉత్తుత్తి సమావేశాలు ఏర్పాటు చేయడం వల్ల ఉద్యోగులకు ఒరిగేదేమీ లేదని ఉపాధ్యాయ సంఘాల సమన్వయవేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు 4 శాతం డీఏ ప్రకటించిందని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఉద్యోగులకు దక్కాల్సిన హక్కులను కాలరాస్తూ నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. గతంలో పండుగ సమయాల్లో డీఏ వచ్చేదని, ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రతి పండుగకు ఉద్యోగులు డీఏ ప్రకటన కోసం ఎదురు చూస్తున్నారే కానీ ప్రభుత్వం మాత్రం ఒక్క డీఏ కూడా ఇవ్వలేదని తెలిపారు. ఉద్యోగ సంఘ నాయకులతో ప్రతిసారి సమావేశాలకు పిలిచి ఉద్యోగులకు సంబంధించిన ఒక్క సమస్య కూడా పరిష్కరించకుండానే ముగిస్తున్నారని పేర్కొన్నారు. పీఆర్సీ, డీఏ, సీపీఎస్ రద్దు, ఉమ్మడి సర్వీసు నిబంధనల అమలు, ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఉపాధ్యాయుల పదోన్నతులు, జేఎల్ పదోన్నతులు, ఆదర్శ పాఠశాలలు, మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు వంటివి ఎన్నో ఉన్నప్పటికీ వాటిలో ఒక్కటి కూడా పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యలు పెడచెవిన పెట్టిన ప్రభుత్వానికి తగిన మూల్యం చెల్లించుకునే రోజులు త్వరలోనే రానున్నాయని ఆయన హెచ్చరించారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



అటవీ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఫారెస్ట్ రేంజర్ కళావతి

సిద్దవటం, మార్చి8: మహాశివరాత్రి సందర్భంగా లంకమల అభయారణ్యంలోని నిత్యపూజ కోనలో విధినిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సిద్దవటం ఫారెస్ట్ రేంజర్ కళావతి సూచించారు. వణ్యప్రాణులను దృష్టిలో పెట్టుకుని ప్లాస్టిక్ వంటి పదార్థాలు వేయనివ్వకుండా చూడాలని, పంచలింగాల వద్ద అపరిశుభ్రత కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిత్యపూజ కోనకు వెళ్లే రహదారిలోని వద్ద చెక్‌పోస్టు వద్ద ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని, మత్తుపదార్థాలను అరికట్టాలని సిబ్బందికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి ఓబులేసు పాల్గొన్నారు.

రాజంపేట పట్టణంలో పోలీసుల కవాతు



రాజంపేట పట్టణంలో మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న పోలీసులు

రాజంపేట టౌన్, మార్చి8: సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ ప్రజల్లో అభద్రతాభావాన్ని పోగొట్టేందుకు శుక్రవారం రాజంపేట పట్టణంలో పోలీసులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. డీఎస్పీ చైతన్య సూచన మేరకు రాజంపేట పట్టణ, రూరల్ ప్రాంతాల్లో పోలీస్ శాఖ, పారా మిలిటరీ బలగాలతో పట్టణంలోని మన్నూరు పోలీస్‌స్టేషన్ వద్ద నుంచి కూచివారిపల్లె వరకు కవాతు చేశారు. రాష్ట్రంలో అప్పటికే 30 యాక్ట్ అమల్లో ఉందని సభలు, ర్యాలీలు నిర్వహించాలంటే పోలీసుల అనుమతి తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టన సీఐ మద్దయ్య ఆచారి, మంజునాధరెడ్డి, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

గంగమ్మజాతరకు 500 మందితో బందోబస్తు

- ఏర్పాట్లు పరిశీలించిన డీఎస్పీ

లక్కిరెడ్డిపల్లె, మార్చి 8: మండలంలోని అనంతపురం గ్రామంలో గంగమ్మ జాతకు 500 మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా తెలిపారు. శుక్రవారం ఆయన గంగమ్మజాతర జరిగే చోటును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 11, 12 తేదీల్లో జరిగే జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 500 మంది పోలీసులను, ప్రత్యేక పోలీసు బలగాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. లక్షల సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తారని వీరికి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జాతరలో జూదాలు, అక్రమ మద్యం విక్రయాలు, దొంగతనాలు జరిగితే వెంటనే పోలీసు కస్టడీకి తీసుకొని అరెస్టు చేస్తామన్నారు. సోమవారం రాత్రి కుంకుమ బండ్లు, చాందినీబండ్ల వద్ద ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేస్తామన్నారు. వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకొని జాతర జరిగే చోటుకు నాలుగువైపులా వాహనాల స్టాండ్‌లు ఏర్పాటుచేయాలని సీఐ గంగనాబాబు, ఎస్ఐ విష్ణువర్ధన్‌లకు సూచించారు. మర్రిమాను క్రాసురోడ్డు, లక్కిరెడ్డిపల్లె క్రాస్‌రోడ్డు, నల్లగుట్టపల్లె క్రాస్‌రోడ్ల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా సూచికబోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రవీంద్రరాజు ఆలయ చైర్మన్ మురికినాటి రెడ్డెయ్య, కమిటీ సభ్యులు, పూజారులు రామయ్య, గంగాధర తదితరులు పాల్గొన్నారు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ మహబూబ్‌బాషా

రూ.లక్షలు మట్టిపాలు

- పులివెందుల బస్‌టర్మినల్‌లో ..
- నాలుగు షాపింగ్ గదుల తొలగింపు
- ఏడాదిన్నర అవుతున్నా.. ఒక్క దుకాణమూ రాలేదు
- అభాసుపాలవుతామని గదులతొలగింపు..?

పులివెందుల రూరల్, మార్చి 8: ముందస్తు ప్రణాళిక, సమన్వయంతో ముందుకెళ్లాల్సిన అధికారుల తప్పిదం మరోసారి బట్టబయలైంది. పులివెందులలో మరోసారి లక్షల రూపాయలు వృథా అవుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా పట్టణంలో వైఎస్సార్ బస్‌టర్మినల్ నిర్మించారు. అందులో విశాల బస్‌స్టేషన్, ప్లాట్‌ఫామ్‌లు, గ్యారేజీ, వాహనాల పార్కింగ్, షాపింగ్ గదులు సుందరంగా తీర్చిదిద్దారు. దాదాపు రూ.22.50 కోట్లతో నిర్మించిన ఈ బస్‌టర్మినల్‌ను 2022 డిసెంబరులో ముఖ్యమంత్రి ప్రారంభించారు. ముఖ్యమంత్రి ప్రారంభించిన కొద్ది నెలల తర్వాత బస్సుల రాకపోకలు ప్రారంభించారు. బస్‌టర్మినల్‌లో గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్‌ఫ్లోర్‌లో షాపింగ్ గదులు, ఏసీ వసతితో కూడిన గదులు, ప్రయాణికులు వేచి ఉండే ఆవరణం, టాయిలెట్లు నిర్మించారు. రాకపోకలు ప్రారంభించిన కొద్దిరోజులకే పర్యాటక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం వార్షిక పర్యాటక ఎక్సలెన్స్ అవార్డ్-2023 దక్కించుకుంది. కాగా ప్రయాణికులు కూర్చునేందుకు ఇప్పటికే విశాల ఆవరణం ఉంది. దాదాపు రెండు వందల మంది ప్రయాణికులు కూర్చునేందుకు వీలున్న బస్టాప్‌లో నాలుగు షాపింగ్ గదులు తొలగించి మరింత ఆవరణం ఏర్పాటు చేస్తున్నారు. ఇదో అంతుపట్టని విషయం. ఏదిఏమైనా పులివెందులలో లక్షల రూపాయలు వృథా అని మరోసారి రుజువవుతోందని అక్కడి ప్రయాణికులు, స్థానిక ప్రజలు అంటున్నారు.



ఒక్క దుకాణం కూడా లేదు..

బస్‌టర్మినల్ ప్రారంభించి దాదాపు ఒకటిన్నర సంవత్సరం అవతున్నా.. ఇంతవరకు టర్మినల్‌లో ఒక్క దుకాణం కూడా ఏర్పాటు కాలేదు. ఇన్నాళ్లయినా ఖాళీగా ఉన్న ఈ గదులను అలాగే ఉంచుకొని అభాసు పాలయ్యేకంటే తొలగించడమే మేలు అనుకున్నారేమో అధికారులు, నాలుగు గదులను తొలగిస్తున్నారు. ఈ విషయంపై పులివెందుల ఆర్టీసీ డీఎం రామకృష్ణను వివరణ కోరగా ప్రయాణికులు కూర్చునేందుకు మరింత వీలు కల్పించేందుకు గదులను తొలగిస్తున్నట్లు తెలిపారు.

షాపింగ్ గదులను తొలగిస్తున్న దృశ్యం



పులివెందుల బస్‌టర్మినల్‌లో ఖాళీగా ఉన్న ఆవరణ



పులివెందుల బస్‌టర్మినల్‌లో తొలగనున్న షాపింగ్ గదులు

హరహర మహాదేవ..శంభో శంకర

● శివాలయాలకు పోటెత్తిన భక్తులు ● శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు ● దాతల అన్నదానం

పెండ్లిమర్రి, మార్చి 8: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం శివాలయాలు శివ నామస్మరణతో మార్మోగాయి. భక్తులు హరహర మహాదేవ శంభో శంకర అంటూ పరమశివుడిని వే డుకున్నారు. ఆలయాల్లో పలువురు దాతలు అన్నదానం చే శారు. ఆ బోళాశంకరుడిని పిల్లలు, పెద్దలు ఇంటిల్లిపాదిగా తరలివెళ్లి భక్తిశ్రద్ధలతో పూజించి తరలించారు. జిల్లాలోనే ప్రసిద్ధ శైవక్షేత్రమైన పొలతల ఆలయం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివనామస్మరణతో మారుమోగింది. గురువారం నుంచే భక్తులు కొండపైకి చేరుకొని శుక్రవారం వేకువజామునే కోనేరులలో స్నానాలు చేసి పరమశివున్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కదేవతల ఆలయం వద్ద బిడ్డలు లేని, గాలి సోకిన స్త్రీలు కోనేరులలో మునిగి తడి బట్టలతో వరపడ్డారు. బండన్న స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి స్వామివారి ఊరేగింపు తర్వాత బండెన్న స్వామివారికి భక్తులు ముక్కోడలు తీర్చుకున్నారు. మన జిల్లా నుంచే కాకుండా పొరుగు జిల్లాలైన అనంతపురం, కర్నూలు, చిత్తూరు, ప్రకాశం అలాగే పొరుగు రాష్ట్రమైన కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు తరలి వచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అలాగే కళ్యాణ వేదిక వద్ద శివపార్వతుల కళ్యాణం వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య భక్తజనుల శివనామస్మరణ నడుమ కమనీయంగా కళ్యాణం నిర్వహించారు. ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ఆలయ ఛైర్మన్ అంబటి నాగమల్లారెడ్డి దంపతులు కళ్యాణంలో పాల్గొన్నారు.

కిక్కిరిసిన నిత్యన్నదాన క్షేత్రం

పొలతల మల్లికార్జునుడిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు కాశిరెడ్డినాయన నిత్య అన్నదాన క్షేత్రం వారు భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. అలాగే పొలతల క్షేత్రానికి వెళ్లే దారిపొడవున దాతలు భారీగా అన్న ప్రసాదంతో పాటు వాటర్ ప్యాకెట్లు, మజ్జిగ భక్తులకు ప్రయాణిస్తున్న వాహనాలను ఆపి అందించారు.

వైభవంగా స్వామివారి ఊరేగింపు

పార్వతి సమేత మల్లికార్జునస్వామిని ఆల య గర్భగుడి నుంచి అక్కదేవతల ఆల యం వరకు సంగీత నీరాజనాల నడుమ బాణ సంచా పేల్చుతూ వచ్చిన భక్తుల సంక్షంలో వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. అలాగే స్వామివారి దర్శనం కోసం వచ్చిన లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఛైర్మన్ నాగమల్లారెడ్డి, ఈఓ శ్రీనివాసులు, అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సంగమేశ్వరంలో భక్తులు కిటకిట

వీరపునాయునిపల్లె, మార్చి 8: మండలంలోని పావని, పాపాఘ్ని, మొగమోరు సంగమం వద్ద వెలసిన సంగమేశ్వరాలయం శుక్రవారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివనామస్మరణతో మార్మోగింది. ఉదయం నుంచి భక్తులు ఆలయ ప్రాంగణంలో బారులు తీరారు. ఎండను సైతం లెక్కచేయకుండా మహిళలు, పిల్లలు, పెద్దలు, వృద్ధులు ఎండలో నిలబడి ఆది దేవుడుగా పిలవబడుతున్న మకర గణపతి విఘ్నేశ్వరుడు, సంగమేశ్వరుడు, పార్వతి దేవిలను దర్శించుకున్నారు. ఛైర్మన్ శివాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి పురోహితులచే అభిషేకాలు, అర్చనలు చేయించారు. ఆలయ ప్రాంగణమంతా శివనామస్మరణం, ఓం నమశివాయ అనేనామంతో భక్తులు జరిపించుకుంటూ సంగమేశ్వరుడిని దర్శించుకొని మొ క్కులు తీర్చుకున్నారు. మొక్కుబడిలో ఉన్న మహిళలు ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభం వద్ద దీపాలను వెలిగించారు. అంతే కాకుండా పార్వతీదేవిని ప్రత్యేకంగా వెండి అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు, చిన్నారులచే వేయించిన కోలాటం ఆకట్టుకుంది. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు.

కడప నగరంలో...కడప (కల్చరల్), మార్చి 8: శివాలయాలకు భక్తులు పోటెత్తారు. ఆలయాల వద్ద అభిషేకాలు, కళ్యాణాలు నిర్వహించారు. కడప నగరంలోని మృత్యుంజయకుంట శివాలయం, దేవుని కడపలో వెలసిన సోమేశ్వర స్వామి ఆలయంలో కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. గడ్డిబజార్‌లో గల సోమసుందేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు.

చెన్నూరులో...మండలంలోని శివాలపల్లెలో వెలసిన కాశీ విశ్వేశ్వరాలయం లో శుక్రవారం శివపార్వతుల కల్యాణం కన్నులపండువగా జరిగింది. అలాగే పెన్నానది వడ్డున వెలసిన దాక్షాయణి మల్లేశ్వరస్వామి ఆలయంలో నంది సేవా ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. బండలాగుడు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే రామనపల్లె, ఉప్పరపల్లె చెన్నూరు నాగలింగేశ్వర ఆలయాల్లో శివునికి అభిషేకాలు చేశారు.

సీకేదిన్నెలో... చింతకొమ్మదిన్నె మండలంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. బుగ్గమల్లేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణం జరిపించి బండలాగుడు పోటీలు నిర్వహించారు. బయనపల్లె ఉమామహేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకం నిర్వహించి కల్యాణం, అన్నదానం, గ్రామోత్సవాలు నిర్వహించారు. మండలంలోని అన్ని శివాలయాలు శివరాత్రి మహోత్సవ వేడుకలు ఎంతో ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామివారికి పూజలు నిర్వహించారు.

వల్లూరులో... పుష్పగిరి పంచమనదీ సంగమంలో కొలువై ఉన్న కామాక్షి సమేత వైద్యనాదేశ్వర కొండపైన శ్రీలక్ష్మి చెన్నకేశవ సంతాన మల్లేశ్వరుడిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. అలాగే వల్లూరులోని భవానీ శంకర ఆలయంలో రుద్రాభిషేకాలు చేశారు. గంగాయపల్లె గోటూరు, పెద్దపుత్త శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు.

కమలాపురంలో... మండల పరిధిలోని చదిపిరాళ్ల, పెద్ద చెప్పలి, గంగవరం తదితర గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు శివుడికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. చదిపిరాల్లలో అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో పూజలు ఘనంగా జరిగాయి. అభిషేకాల అనంతరం మధ్యాహ్నం కల్యాణం నిర్వహించారు. అనంతరం ఎంపీటీసీ జయసుబ్బారెడ్డి కుటుంబం భక్తులకు అన్నదానం చేశారు. రామాపురంలోని మోక్షనారాయణస్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా పూజలు నిర్వహించారు. అర్ధరాత్రి 12గంటల సమయంలో లింగోద్భవం సమయంలోస్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు.

పులివెందులలో...మండలంలోని నామాలగుండు, గుండాలయ్యకోన, పంచలింగాలకోన, ఎర్రంరెడ్డిపల్లె గ్రామంలో వెలసిన హరిస్వామి ఆలయం, పట్టణంలోని మిట్టమల్లేశ్వరాలయం, వీరభద్రస్వామి, ఉమామహేశ్వరస్వామి తదితర ఆలయాలకు భక్తులు తరలివెళ్లి శివుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

చక్రాయపేటలో...చక్రాయపేటలో వెలసిన వేంకటేశ్వర స్వామి, రాచరాయ దేవాలయ ఆవరణంలో ఒకే వేదికపై శివపార్వతులకు, శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారికి కనీవినీ ఎరుగని రీతిలో కళ్యాణోత్సవం నిర్వహించారు. టీటీడీ వేదపండితులు రాయల్‌స్వామి, మనోహర్ ఆచార్యులు, రామాయణం, అశోక్‌కుమార్, మోహన కృష్ణల వేదమంత్రోచ్చరణల మధ్య ఈ కల్యాణం అంగరంగవైభవంగా నిర్వహించినట్లు ఆలయ ఛైర్మన్ లాయర్ రామాంజనేయరెడ్డి తెలిపారు.

ఉత్కంఠభరితంగా బండలాగుడు పోటీలు

చక్రాయపేటలో వేంకటేశ్వర, రాచరాయ దేవస్థానంలో జరిగే శివరాత్రి ఉత్సవాలలో భాగంగా ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ప్రొద్దుటూరుకు చెందిన వెంకటసుబ్బారెడ్డి ఎద్దులు మొదటి బహుమతి పొందాయి. వెంకటసుబ్బయ్య లక్ష రూపాయల బహుమతి అందించారు. నాగర్‌కర్నూల్ రామచంద్రారెడ్డి రెండవ బహుమతి, ఖైదుకూరుకు చెందిన రెడ్డిసుబ్బారెడ్డి మూడవ బహుమతి, నంద్యాలకు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి నాలుగో బహుమతి, ప్రొద్దుటూరుకు చెందిన వెంకటసుబ్బారెడ్డి ఐదవ బహుమతి అందుకున్నారు. ఆలయ ఛైర్మన్ లాయర్ రామాంజనేయ రెడ్డి, మాజీ ఛైర్మన్లు చక్రపాణిరెడ్డి, హరినాథరెడ్డి, రామిరెడ్డి గారి ఓబుళరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.


సంగమేశ్వరాలయంలో అలంకరణలో ఉత్సవమూర్తులు


కడప: మృత్యుంజయకుంట శివాలయంలో స్వామి,అమ్మవార్ల కల్యాణం తిలకిస్తున్న భక్తులు


దేవుని కడపలో లక్ష్మీవేంకటేశ్వర స్వామివారి కల్యాణం


పులివెందుల: పూజలందుకుంటున్న హరిస్వామి


చక్రాయపేట వేంకటేశ్వర, రాచరాయ దేవస్థానంలో శివపార్వతులు, శ్రీదేవి భూదేవి వేంకటేశ్వరస్వామిల కల్యాణోత్సవం




పెండ్లిమర్రి: పొలతల మల్లేశ్వర ఆలయంలో స్వామివారి దర్శనం కోసం క్యూకట్టిన భక్తులు.. అక్కదేవతల వద్ద వరపడిన దృశ్యం


కమలాపురంలో శివపార్వతుల కల్యాణోత్సవం


వల్లూరు: ప్రత్యేక అలంకరణలో సంతాన మల్లేశ్వరుడు

విజయదుర్గాదేవి ఆలయంలో ఘనంగా రుద్రాభిషేకం

కడప (కల్చరల్), మార్చి 8: మహాశివరాత్రి సందర్భంగా కడప నగరం బిల్టప్ సర్కిల్ సమీపంలోని విజయదుర్గాదేవి ఆలయంలో శుక్రవారం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. తదుపరి సుమంగళి పూజ, పల్లకిసేవ నిర్వహించారు. శుక్రవారం మహాశివరాత్రి కలిసి రావడంతో అమ్మవారికి తెల్లవారుజామున విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. కార్యక్రమాలకు భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తరించారు. అనంతరం రాత్రి 8 గంటలకు విజయ దుర్గాదేవికి పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు.


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఆయుష్ వైద్యశిబిరం ప్రారంభం

వేంపల్లె, మార్చి 8: వేంపల్లెలో శుక్రవారం ఏపీసీసీ మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి ఆయుష్ వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు వడదెబ్బకు లోను కాకుండా ఉండేందుకు ప్రభుత్వం వేంపల్లె పాత పేటలోని భవాని నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం వారు ఆయుష్ వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలన్నారు. డాక్టర్ వైద్యనాథన్, ఏఎన్ఎంలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జేవీ పేరుతో రైతుభవన్ ఏర్పాటు చేయాలి: సీపీఐ

కడప (నాగరాజుపేట), మార్చి 8 :నమ్మిన సిద్ధాంతాల కోసం, దోపిడీ లేని సమాజం కోసం చివరి వరకు పోరాడిన నిబద్ధత గల వ్యక్తి జె.వెంకట్రామిరెడ్డి (జేవీ)అని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర కొనియాడారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన జేవీ 28వ వర్ధంతి సందర్భంగా జేవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చంద్ర మాట్లాడుతూ కడప జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన జేవీ ఉపాధ్యాయ వృత్తిని పక్కనబెట్టి ఉద్యమ బాట పట్టి విద్యార్థి యువజన రైతు సంఘాల ఏర్పాటులో కీలక పాత్ర వహించారన్నారు. కార్యకర్తలకు సరళమైన భాషలో రాజకీయ అవగాహన కల్పించడంలో కృషి చేశారన్నారు. కామ్రేడ్ జేవీ పేరుతో జిల్లా కేంద్రంలో రైతుభవన్ నిర్మించాలని డిమాండ్ చేశారు. సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ, సహాయ కార్యదర్శి కేసీ బాదుల్లా, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ సుబ్బారెడ్డి, పోతిరెడ్డి భాస్కర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగాసురేష్, రైతు సం ఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటు మనోహర్‌రెడ్డి, సీపీఐ సీనియర్ నాయకులు సా వంత్ సుధాకర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, రైతు సంఘం నాయకులు శివశంకరరెడ్డి, బాలచంద్రయ్య ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



జేవీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఉర్దూ అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయండి

● ఉప ముఖ్యమంత్రికి రూటా వినతి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 8 : రాష్ట్రంలో ఉర్దూ అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని రూటా రాష్ట్ర సమన్వయ కర్త మహ్మద్ అయుబ్, రాష్ట్ర కార్యదర్శి షానుల్లాఖాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం డిప్యూటీ సీఎం కార్యాలయంలో వారు ఉప ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 55వేల అంగన్వాడీ కేంద్రాలు ఉన్నప్పటికీ ఒక్క ఉర్దూ అంగన్వాడీ కేంద్రం లేదని చెప్పారు. లక్షల సంఖ్యలో మాతృభాష ఉర్దూ కలిగిన పసిపిల్లలు తమ మాతృభాషలో విద్యనభ్యసించే అవకాశం కల్పించాలని కోరారు. అంజద్‌బాషా స్పందిస్తూ ఉర్దూ అంగన్వాడీ కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రూటా నాయకులు సికిందర్‌బాషా, గౌస్‌అ హ్మద్, ఖాజామైనుద్దీన్ పాల్గొన్నారు.

నేటి పత్ర సంక్షేమ సంఘం సభను విజయవంతం చేయండి

పులివెందుల రూరల్, మార్చి 8: భవిష్యత్ కార్యాచరణకు శనివారం జరిగే సభను విజయవంతం చేయాలని పత్ర సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సునీల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. శనివారం పట్టణంలోని ఎస్ఎస్‌బీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేస్తున్న పత్ర సంక్షేమ సంఘం ఆత్మీయ సభను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతురాయుడు, గౌరవాధ్యక్షుడు చిన్న అంజనేయులు, ఎక్సైజ్ ఏఎస్పీ రమేష్, గౌరవాధ్యక్షుడు రామ్మోహన్ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. కావున పత్ర కులస్థులు అందరూ తప్పక హాజరు కావాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మహిళలకు టీడీపీ, జనసేన పెద్దపీట

● టీడీపీ కడప నియోజకవర్గ అభ్యర్థి మాధవీరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 8 : మహిళాసాధికారత దిశగా టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ కొత్త పథకం అమలు చేసేందుకు శ్రీకారం చుట్టి మహిళలకు పెద్దపీట వేస్తున్నారని టీడీపీ కడప నియోజకవర్గ అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా కలలకు రెక్కలు అనే పథకాన్ని రూపొందించారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలోని ఏ ఆడబిడ్డా ఆర్థిక ఇబ్బందులతో ఇంటికి పరిమితం కాకూడదనే లక్ష్యంతో నూతన పథకానికి రూపకల్పన చేశారన్నారు. ఈ పథకం ద్వారా వృత్తిపరమైన విద్యకు మార్గాలు అందించడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రధాన లక్ష్యమన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన మహిళలు ప్రొఫెషనల్ కోర్సులు చేసేందుకు తీసుకునే బ్యాంకు లోన్‌కు పూర్తి బాధ్యత టీడీపీ, జనసేన తీసుకుంటుందని స్పష్టం చేశారు. మధ్యలో విద్యను ఆపేసేవారు తమ కలలను సాకారం చేసుకుని ఉన్నత విద్య చదివి తమ లక్ష్యాలను సాధించేందుకు దోహదపడుతుందన్నారు. ఈ పథకం వల్ల మహిళల్లో ఆర్థిక జీవన ప్రమాణాలు పెరుగుతాయని తెలిపారు.

ఉత్తమ మహిళ వసతి గృహ సంక్షేమ అధికారిగా కళావతి

పులివెందుల టౌన్, మార్చి 8: పులివెందులలో ఉత్తమ సేవలు అందించిన ప్రభుత్వ గిరిజన సమీకృత బాలికల వసతిగృహ సంక్షేమ అధికారిగా విధులు నిర్వహిస్తున్న కళావతి ఉత్తమ మహిళా వసతి గృహ సంక్షేమ అధికారిగా కళావతి అవార్డు అందుకున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీలక్ష్మి చేతులమీదుగా అవార్డును శుక్రవారం కడపలో అందుకున్నారు.


అవార్డు అందుకుంటున్న కళావతి

రేపు మిస్టర్ రాయలసీమ జోనల్ బాడీ బిల్డింగ్ పోటీలు

కడప (స్పోర్ట్స్), మార్చి 8: ప్రముఖ బాడీబిల్డర్ స్వర్గీయ షంషీరుద్దీన్ జ్ఞాపకార్థం ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటలకు స్థానిక కళాక్షేత్రంలో మిస్టర్ రాయలసీమ జోనల్ బాడీ బిల్డింగ్ పోటీలు జరగనున్నట్లు కడప జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంటు అన్సర్ ఆలీ తెలిపారు. కడప జిల్లా న్యూ ఆంధ్ర బాడీబిల్డింగ్ అసోసియేషన్ (ఎన్ఏబీబీఏ) జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పోటీలు జరగనున్నట్లు వివరించారు. ఈ పోటీలకు రాయలసీ మస్థాయిలో గల బాడీబిల్డర్లు తప్పకపాల్గొని బహుమతులు అందుకోవాలని కోరారు.

బాల్యం నుంచే శారీరక దృఢత్వాన్ని అలవర్చుకోవాలి

చెన్నూరు, మార్చి 8 : బాల్యం నుంచే శారీరక దృఢత్వాన్ని అలవరచుకోవాలని చెన్నూరు మండల కార్యవాహ సుబ్రమణ్యం అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ పార్కులో శుక్రవారం బాలబాలికలకు గ్రామీణ క్రీడల పట్ల అవగహన కల్పించడంతో పాటు కర్రసాము, దండీలు, పరుగు పందెం, యోగాపై శిక్షణ ఇచ్చారు.

మహిళా సాధికారతే కాంగ్రెస్ లక్ష్యం: తులసిరెడ్డి

వేంపల్లె, మార్చి 8: మహిళా సాధికారతే కాంగ్రెస్ లక్ష్యమని మాజీ రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ రాష్ట్ర మీడియా ఛైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి మహిళా సాధికారితకు పెద్దపీట వేస్తోందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మహిళల పట్ల వివక్ష కొనసాగుతోందన్నారు. డ్వాక్రా సంఘాలకు సున్నా వడ్డీ పథకాన్ని రూ.5లక్షల నుంచి రూ.3లక్షల వరకు తగ్గించిందన్నారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోంది. తాళిబొట్లు తాకట్టు పెడుతున్నారు, నిత్యావసర సరుకుల ధరలు నింగినంటుతున్నాయని తులసిరెడ్డి ఆవేదన చెందారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బంగారుతల్లి, అమ్మహస్తం పథకాలను పునరుద్ధరించడమే కాకుండా రూ.500కే వంట గ్యాస్ సిలిండర్‌ను సరఫరా చేస్తుందన్నారు. అనంతరం పలువురు మహిళలను సత్కరించారు. ధ్రువకుమార్‌రెడ్డి, సుబ్రమణ్యం, రామకృష్ణ, అమర్‌నాథ్‌రెడ్డి, రాజు, బద్రి, నరసింహారెడ్డి, ఉత్తన్న వెంకటేశ్, సుబ్బరాయుడు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.


సన్మానం పొందిన మహిళలతో తులసిరెడ్డి

ప్రతి మహిళా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

కడప (మారుతీనగర్), మార్చి 8: ప్రతి మహిళా సహనగుణం, ప్రతిభతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి మణికంఠ పేర్కొన్నారు. నెహ్రూ యువ కేంద్ర, వికసిత ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కేంద్ర ప్రత్యేక మహిళా కారాగారంలో అంతర్జాతీయ మహిళాదినోత్సవం నిర్వహించారు. ఇందులో మహిళా ఖైదీలకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. పురుషులతో సమానంగా అన్ని రంగాలలో మహిళలు రాణిస్తున్న ప్రస్తుత రోజుల్లో కొంతమంది క్షణికావేశాలకు పోయి కుటుంబాలకు దూరం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలా కాకుండా సహనగుణం అలవరచుకుని అందరి మన్ననలు పొందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ కృష్ణవేణి, జైలర్ భువనేశ్వరి, డిప్యూటీ జైలర్ చిన్నఇమాంబి, జైలు సిబ్బంది, నెహ్రూ యువ కేంద్ర వాలంటీర్ శరత్‌చంద్ర, మహిళా ఖైదీలు పాల్గొన్నారు.

దేశ ఆర్థిక ప్రగతికి మహిళలు కీలకం

కడప (నాగరాజుపేట), మార్చి 8 : దేశ ఆర్థిక ప్రగతికి మహిళలు కీలకమని ఆప్‌కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బుల్ బాషా తెలిపారు. శుక్రవారం ఆప్‌కి ఆవాజ్ రాష్ట్ర కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఆ కమిటీ కన్వీనరు హమీద్ ఖానం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి మగ్బుల్‌బాషా మాట్లాడుతూ చట్టసభల్లో మహిళలకు సముచితస్థానం కావాలని ఎన్నో ఏళ్ల నుంచి మహిళా లోకం డిమాండ్ చేస్తోందన్నారు. నేటికి పాలకులు కరుణించి ఐదేళ్ల తరువాత మూడోవంతు ప్రాతినిధ్యం కల్పిస్తామని చెప్పడం సంతోషకరం అన్నారు. కానీ ఐదేళ్లు ఆగాలని చెప్పడం వెనుక ఆంతర్యమేమిటో అర్థం కావడంలేదన్నారు. మహిళలు చైతన్యవంతం అయినప్పుడే దేశం ప్రగతిపథంలో పయనిస్తుందన్నారు. ఈ కార్యక్రమం లో ఆర్పీపీ నగర కమిటీ సభ్యులు కరీముల్ చాంద్‌బేగం, ఆప్‌కి ఆవాజ్ నగర కన్వీనింగ్ కమిటీ సభ్యులు ఫాతిమున్, మెహనూరు రిజ్వాన భాను, ఆప్‌కి ఆవాజ్ నగర అధ్యక్షుడు అబిద్‌హుసేన్ పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవం

కడప (ఎడ్యుకేషన్), మార్చి 8 : కడప నగరం హనుమప్పవీధి టీడీపీ నాయకురాలు కోట విజయలక్ష్మి కార్యాలయంలో అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ మహిళా నాయకురాళ్లు కోట విజయలక్ష్మి ప్రణవతి, తులశమ్మ, లక్ష్మీరాజ్యం, మంజుల మహిళలకు శాలువా కప్పి సత్కరించారు. వారికి కోటిరెడ్డి రామసుబ్బమ్మ చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి మహిళ ముందు తరాలకు ఆదర్శం కావాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మహిళలను సత్కరిస్తున్న శివకొండారెడ్డి

మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలి

పులివెందుల రూరల్, మార్చి 8: మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని ఏపీఎం కేఎస్ గురురాజ్ సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక వెలుగు కార్యాలయంలో సమాఖ్య సభ్యులకు సమావేశం నిర్వహించారు. కేక్ కట్ అందరికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి మెరుగుపరచుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీసీలు రామచంద్ర, రామాంజనేయ రెడ్డి, వీఓలు, మండల సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీఎం గురురాజ్

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

ఖాజీపేట, మార్చి 8: ఖాజీపేటలో వైసీపీకి చెందని మైనార్టీ నాయకులు హర్షద్, నజీర్ అహమ్మద్, తత్విక్, రఫి, దహీస్, అనుచర వర్గం శుక్రవారం టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో దాదాపు 65 కుటుంబాలు టీడీపీలో ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మల్హోత్ర, నాయకులు కదిరుల్లా, జలీల్, మునీర్, జెండాల మాబాష, కేకే బ్రదర్స్, పూల సుల్తాన్, హబీబ్, వెంకటసుబ్బయ్య, వీరయ్య, సుబ్బయ్య, హరినాథరెడ్డి, గోవిందు సుబ్బయ్య, పిచ్చినాయుడు, భాస్కర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, జానకిరాం, రమేష్‌నాయుడు, రామానాయుడు, క్రిష్ణారెడ్డి, నాగశివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ అభయం పేద మహిళలకు వరం

● డాక్టర్ ఎన్.తులసిరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎన్.తులసిరెడ్డి

జమ్మలమడుగు, మార్చి 8: ఇందిరమ్మ అభయం పేద మహిళలకు వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం జమ్మలమడుగులోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళల అభ్యున్నతికోసం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేద మహిళలకు ఇందిరమ్మ అభయం పథకం అమలు చేస్తుందన్నారు. ఈ పథకం ద్వారా ప్రతినెల ప్రతి నిరుపేద కుటుంబంలో ఉన్న కుటుంబ మహిళా పెద్దకు బ్యాంకు ఖాతాలో రూ.5 వేలు జమ చేస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాల లబ్ధి చేరినా ఇందిరమ్మ అభయం పథకానికి సాటిరావన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మీడియా చైర్మన్ భూతమాపురం సుబ్బారావు, మండల అధ్యక్షుడు మంచాల పుష్పరాజు, ఎస్సీసెల్ అధ్యక్షులు సంజయ్, వెంకటేష్, ప్రవీణ్, రాజేష్, జానకిరాం, నరసింహారెడ్డి, అమర్, ఉత్తన్న, సుబ్బరాయుడు, వినయ్, డింప్ పాల్గొన్నారు.

అభివృద్ధి సంక్షేమం టీడీపీతోనే సాధ్యం



భగత్ సింగ్ కాలనీ ప్రచారంలో పాల్గొన్న సీఎం సురేశ్‌నాయుడు

ప్రొద్దుటూరు, మార్చి 8 : అభివృద్ధి సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని టీడీపీ నాయకుడు సీఎం సురేశ్‌నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం గోపవరం పంచాయతీలోని భగత్‌సింగ్‌కాలనీలో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ మేనిఫెస్టోలోని ఆరు గ్యారెంటీల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీరాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, మున్సిపల్ మాజీ ఇన్‌చార్జ్ చైర్మన్ వీఎస్ ముక్తియార్, ఈవీ సుధాకరరెడ్డి, రాజుపాళెం మండల మాజీ ఎంపీపీ శెట్టిపల్లె ప్రభాకరరెడ్డి, నల్లబోతుల నాగరాజు, 19 వార్డు కౌన్సిలర్ మునీర్ పాల్గొన్నారు.

'కశెట్టి హైస్కూలు వివాదంపై అధికారులు చర్యలు తీసుకోవాలి'

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 8: కశెట్టి పాఠశాల రహదారి విషయంపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామమోహన్ రావు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు తెలిపారు. మైదుకూరురోడ్డులోని కశెట్టి పాఠశాల పక్కనే ఉన్న నూరుల్లా మసీదు కమిటీ సభ్యులు ఇద్దరు పాఠశాల స్థలం మసీదుకు చెందినదని బ్యానర్ ఏర్పాటు చేసి సోషియల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని తెలిపారు. పాఠశాల స్థలం కబ్జా చేస్తారని విస్తృతంగా ప్రచారం అవుతోందన్నారు. ఇటువంటి ప్రచారం వలన మతఘర్షణలు జరిగే అవకాశం ఉందని, రెవెన్యూ, మున్సిపల్, పోలీసు శాఖ అధికారులు స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలకు రహదారి కోసం 1971లో జమ్మలమడుగు ఆర్డీవో సమక్షంలో చర్చలు జరిగాయని తెలిపారు. పాఠశాల రస్తాకోసమే పాఠశాల నిర్వాహకులు మసీదు కమిటీకి ఆర్డీవో సమక్షంలో డబ్బులు చెల్లించడం జరిగిందన్నారు. 2005లో ఇద్దరు మసీదు కమిటీ సభ్యులు కోర్టుకు వెళ్లడం జరిగిందని, కోర్టులో ఉన్న అంశంపై వివాదం చేసే విధంగా ప్రచారం చేయడం తగదని అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు బొందలకుంట గంగమ్మ,పాలేటమ్మ తిరుణాల

ముద్దనూరు మార్చి8 :మండల పరిధిలోని బొందలకుంట గ్రామంలో శనివారం సాయంత్రం గంగమ్మ,పాలేటమ్మ తిరుణాల నిర్వహిస్తున్నట్లు గుడి ధర్మకర్త సుబ్బరాయుడు తెలిపారు. తిరుణాల రోజున అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజాకార్యక్రమాలు నిర్వహిస్తారు. గుడి ప్రాంగణంలో ఎన్నటికీ వేసవిలో కూడా నీరు ఎండిపోని కుంట ఉంది. ఇక్కడి అమ్మవార్లను దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయన్నది భక్తుల నమ్మకం.

పోలీసుస్టేషన్ చేరిన పదో తరగతి ప్రశ్నపత్రాలు

పోరుమామిళ్ల, మార్చి 8 : ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి ప్రశ్నాపత్రాలు పోరుమామిళ్ల పోలీసుస్టేషన్‌కు చేరాయి. శుక్రవారం ప్రశ్నాపత్రాలకు సంబంధించిన బాక్సులను మండలంలోని ప్రధానోపాధ్యాయిలు, ఎంఈవోలు హాజరై వాటిని సీల్ వేసి పోలీసుస్టేషన్‌లో భద్రపరిచారు. మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు పాల్గొన్నారు.

శివాలయాలకు పోటెత్తిన భక్తులు



ప్రొద్దుటూరు శివాలయంలో స్వామివారి కల్యాణం తిలకిస్తున్న భక్తులు, గంగాగౌరీ శివునికి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 8: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పట్టణంలోని శివాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. శివాలయంలో అగస్త్య మహాముని ప్రతిష్ఠించిన శివలింగానికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. రాజరాజేశ్వరీదేవి అమ్మవారిని రంగు రంగుల పూలమాలలతో అలంకరించారు. లోక కల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్రహోమాలు నిర్వహించి ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి పట్టువస్త్రాలు, హోమద్రవ్యాలను పూర్ణాహుతిగా సమర్పించారు. ఆలయ కాలక్షేప మండపంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో గంగాగౌరీ సమేత అగస్త్యేశ్వరస్వామి కల్యాణాన్ని శోభాయమానంగా నిర్వహించారు. రామేశ్వరంలోని ముక్తిరాలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామచంద్రుడు ప్రతిష్ఠించిన సైకత లింగానికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి, ఆదిశంకరాచార్యులు ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. హనుమత్‌లింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు స్వయంగా స్వామివారికి అభిషేకాలు చేశారు. ఆలయ చైర్మన్ మార్తల రాజారెడ్డి, కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పెన్నాతీరంలోని అమృతేశ్వరస్వామి ఆలయంలో మరకత లింగేశ్వరునికి, ద్వాదశ జ్యోతిర్లింగాలు, నవరత్న లింగానికి కాశీజలాలతో భక్తులు అభిషేకాలు చేశారు. అష్టాదశ శక్తిపీఠాలకు ప్రత్యేక పూజలు చేసి సుందరంగా అలంకరించారు.

మైలవరం..: మండల పరిధిలోని అగస్త్యేశ్వరస్వామి కోన, దత్తాత్రేయ మునిస్వామి కోన, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరస్వామి కోన, కల్లుట్ల రామలింగేశ్వరస్వామి కోన తదితర శివాలయాల్లో శుక్రవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు పాల్గొన్ని శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో అన్నదానం ఏర్పాటు చేశారు.

కొండాపురం..: మహాశివరాత్రి వేడుకలను శుక్రవారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. బాలప్పకోన, మల్లేశ్వరకోన, గండ్లూరు శివాలయం తదితర చోట్ల ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.బాలప్పకోనలో శివపార్వతులకు కళ్యాణం నిర్వహించారు.ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

బద్వేలు టౌన్..: శివరాత్రి పర్వదిన సందర్భంగా లంకమల అభయారణ్యంలో వెలసిన ముక్తి రామలింగేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ఆవరణలో దాతలు అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రికి స్వామివారికి కల్యాణం నిర్వహించి ఆలయ ఆవరణలోని కోనేరులో తెప్పోత్సవం నిర్వహించారు. అలాగే బద్వేలు పట్టణంలోని రూపరాంపేట శివాలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం చేశారు. అనంతగిరి క్షేత్రంలోని మృత్యుంజయాలయం, చెన్నంపల్లె శివాలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పోరుమామిళ్ల..: మండలంలో శివరాత్రిని పురస్కరించుకుని త్రిపురసుందరీదేవి, రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే వెంకటాపురం సమీపంలో ఉన్న గోశృంగ మల్లికార్జునుడి ఆలయం, సిద్దవరం సమీపంలో ఉన్న సిద్దుల క్షేత్రంలో పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులకు భోజన ఏర్పాట్లు చేశారు.

బద్వేలు..: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం బద్వేలు నియోజకవర్గ పరిధిలోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. లంకమల్లలో శివుడిని దర్శించుకునేందుకు భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. రాత్రి జాగారం చేసేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు, హరికథ కాలక్షేపాలు ఏర్పాటు చేశారు. బద్వేలుకు సమీపంలోని లంకమల్ల శైవ క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. లంకమల్ల అభయారణ్యంలో ముక్తి రామలింగేశ్వరస్వామి ఆలయానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. బ్రహ్మంగారిమఠంలో వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గోపవరం మండలంలోని మల్లెంకొండలో, అట్లూరు మండలంలోని కమలకూరులోని కాశీబుక్క మల్లేశ్వర ఆలయం, బి.మఠం మండలం పలుగురాళ్లపల్లెలో సోమేశ్వరస్వామి, మలుగుడుపాడులో నీలకంఠేశ్వరస్వామి, కాశినాయన ఆశ్రమ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బి.మఠం, లంకమల్లకు బద్వేలు ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. పోలీసులు, సిబ్బంది గట్టి బందో బస్తు నిర్వహించారు.

చాపాడు..: మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవాలయంలో శుక్రవారం మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. వీరభద్రుని, శివునికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు క్యూలో నిలబడి దైవదర్శనం చేసుకున్నారు. వీరభద్రస్వామిని, అమ్మవారిని నందివాహనంపై ఊరేగింపు జరిపారు. సర్వమత అన్నదాన సత్రంలో, ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో, దేవస్థానం ఆధ్వర్యంలో ఇంకా పలు చోట్ల భక్తులకు అన్నదానం చేశారు. ఎస్ఐ కొండారెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ముద్దనూరు..: మండలంలోని ముద్దనూరు శివాలయం, బొందలకుంట బసవేశ్వరస్వామి ఆలయంలో ఆలయంలో ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు.బసవేశ్వరస్వామి, శివునికి ప్రత్యేక అలంకరణ, పూజాకార్యక్రమాలు,రథోత్సవం నిర్వహించారు.భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు.

ఎర్రగుంట్ల..: శివరాత్రిని పురస్కరించుకుని శివవాలయాలకు భక్తులు పోటెత్తారు. స్థానిక ఐసీయల్‌లోని ఉమామహేశ్వరాలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకం, నిర్వహించారు. రాత్రి 12గంటలకు లింగోద్భవ పూజలు నిర్వహించారు. అలాగే మహేశ్వరనగర్, దొండుపాడులోని శివాలయంలో, మెయిన్‌బజార్‌లోని అమ్మవారిశాలలో వెలసిన శివుడిని, పోట్లదుర్తి నడిగడ్డ శివాలయంలో, ఆర్టీపీపీ, చిలమకూరులో భక్తులు ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. ఆలయాల్లో భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి జాగారం చేశారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగులో మహాశివరాత్రి పర్వదినం పురష్కరించుకుని అన్ని శివాలయాల్లో భక్తులు పూజలు చేసి మొక్కుకున్నారు. అందులో భాగంగా మండలంలోని కన్యతీర్థం, శ్రీ త్రిపురసుందరీ, సుందరేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు చేసి మొక్కుకున్నారు. అలాగే మోరగుడి ప్రదాన రోడ్డుపక్కన, శివాలయంలో, ఎస్.ఉప్పలపాడు, గండికోట, పెద్దదండ్లూరు, దేవగుడి, తదితర గ్రామాల్లో భక్తులు పూజలు చేశారు. అలాగే జమ్మలమడుగు పట్టణంలోని గ్రంథేవారి శ్రీ సోమేశ్వర స్వామి దేవస్థానం నందు మహాశివరాత్రి పండుగ పురష్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో సామూహిక రుద్రాభిషేకాలు, లింగోదర్భవ సమయంలో అన్నపూర్ణ అభిషేకం, కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాలయాలలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

కాశినాయన..: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని చెన్నవరం,అక్కంపేట,వరికుంట్ల,కనెకలగుండం,జ్యోతిక్షేత్రం తదితర ప్రాంతాల్లోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చెన్నవరం సమీపంలోని ఇష్టకామేశ్వరీదేవి సమేత సాంభశివస్వామి దేవాలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు.అన్నదాన కార్యక్రమాలు, భజనలు,కోలాటాలు ఏర్పాటు చేశారు.

మైదుకూరు..: మహాశివరాత్రి సందర్భంగా శైవక్షేత్రాలతో పాటు పార్వతీనగర్‌లోని ఓంకారేశ్వర స్వామి, పట్టణంలోని భీమేశ్వరస్వామి, నగరేశ్వర స్వామి ఆలయంతో పాటు పెద్దమ్మతల్లి వద్ద విగ్రహమూర్తులకు ప్రత్యేక అలంకారం చేసి భక్తులచే పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలతో పాటు రుద్రహోమాలు నిర్వహించారు. భీమేశ్వర స్వామికి పట్టణానికి చెందిన సింగయ్యగారి రామసుబ్బయ్య, రామమోహన్ ఇత్తడి నాగపడిగను స్వామి వారికి సమర్పించారు. అలాగే గుడిపాడు సమీపంలోని శివాలయంలో మైదుకూరుకు చెందిన సత్యరాఘవేంద్ర బుక్‌స్టాల్ ఆధ్వర్యంలో స్వామివారికి లింగద్భోవపూజలు నిర్వహించారు. ఓంకారేశ్వరునికి, భీమేశ్వర స్వామి ఆలయాల్లో శివపార్వతుల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించడంతో భక్తాదుల రాత్రి జాగారం చేశారు.

ఖాజీపేట..: శివరాత్రి సందర్భంగా అగ్రహారంలోని శివాలయం, సాయిబాబా, కన్యకాపరమేశ్వరీదేవి ఆలయం, నాగనాథేశ్వరుని కోన భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి అధిక సంఖ్యలో పాల్గొని నాగనాథేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులకు కొండ కిందిభాగంలో అన్నదానం చేపట్టారు. రాత్రి జాగారం చేసే భక్తులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కాగా కొండ కిందిభాగాన వైద్యాధికారి ముబీన్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు.

బి.కోడూరు..: బి.కోడూరు మండల పరిధిలోని మున్నెల్లి సగిలేటి వద్దున వెలసిన పురాతన శివాలయంలో ఐత్రంపేట శివాలయం, మేకవారిపల్లె వద్ద వెలసిన 108 శివలింగాల వద్ద శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని భక్తులు విరివిగా పాల్గొని పూజలు నిర్వహించారు. అక్కడికి వచ్చిన భక్తులందరికీ తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి ఐత్రంపేట శివాలయంలో కోలాటం, చెక్కభజనలు, పాటకచ్చేరి నిర్వహించారు.

గోపవరం..: మండల పరిధిలోని అన్ని శివాలయాల్లో శివనామస్మరణ మారుమోగింది. మల్లెంకొండేశ్వరస్వామి ఆలయంలో అంగరంగ వైభవంగా కార్యక్రమాలు నిర్వహించారు. రాచాయిపేట శివాలయంలో వైభవంగా పూజాభిషేకాలు చేశారు. మల్లాలమ్మ కోన సమీపానన్న నూతనంగా నిర్మితమైన మలేశ్వరస్వామి ఆలయంలో పలు రకాల పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఆయా శివాలయాల్లో ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు. కాగా మల్లెంకొండస్వామి వద్ద వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.



చాపాడులో స్వామి దర్శనార్థం క్యూలైన్లో ఉన్న భక్తులు



చాపాడులో స్వామివారి ఊరేగింపు



జమ్మలమడుగు.. కన్యతీర్థంలో స్వామి దర్శనం కోసం భక్తులు



గుడిపాడుసమీపంలోని శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



మైదుకూరులో ప్రత్యేక అలంకారంలో భీమేశ్వరుడు, కాశినాయన.. చెన్నవరం శివాలయంలో నిర్వహిస్తున్న శివపార్వతుల కల్యాణం

రాజుపాలెం..: మండల పరిధిలోని వెల్లాల, అర్కటవేముల, పర్లపాడు, రాజుపాలెం, టంగుటూరు గ్రామాల్లోని పురాతన శివాలయాల్లో శివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు శివాలయాలకు వెళ్లి పూజలు చేశారు.అనంతరం రాత్రి జాగారం ఏర్పాటు కోసం చెక్కభజన, తాళ భజనలు ఏర్పాటు చేసుకున్నారు.

ప్రతిష్ఠించిన విగ్రహాలు మాయం



ఐదురోజుల క్రితం సీతారామవిగ్రహాలు ప్రతిష్ఠించిన దృశ్యం (ఫైల్), విగ్రహాలు మాయం కావడంతో రాముని ఫొటో ఉంచి పూజలు చేస్తున్న కాలనీవాసులు

బద్వేలు రూరల్, మార్చి 8 : స్థానిక శివానగర్‌లో ఓ ప్రభుత్వ స్థలాన్ని స్థానిక వైసీపీ నాయకులు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తుండగా కాలనీవాసులందరూ ఏకమై ఇటీవల ఆక్రమణలు అడ్డుకుని సీతారామలక్ష్మణ విగ్రహాలు ప్రతిష్ఠించి పూజలు చేశారు. అయితే హఠాత్తుగా గురువారం రాత్రి ప్రతిష్ఠించిన విగ్రహాలు మాయం కావడంతో స్థానిక కాలనీవాసులు, వీహెచ్‌పీ నాయకులు శుక్రవారం ఉదయాన్నే విగ్రహాలు మాయమైన స్థలంలో ఆందోళన నిర్వహించి తిరిగి సీతారాముల పటాన్ని అక్కడ ప్రతిష్ఠింపజేసి పూజలు ప్రారంభించారు. స్థానిక శివానగర్‌లో బెస్తకాలనీలో సర్వేనెం.987లో ఆరు సెంట్ల ప్రభుత్వ భూమి ఉండగా, 35 సంవత్సరాలుగా కాలనీవాసులు అక్కడ ఓ గుడిని నిర్మించాలని ఆ స్థలాన్ని అలాగే వదిలేశారు. అయితే ఇటీవల రెండు సంవత్సరాలుగా శివానగర్‌లోనే ఉంటున్న వైసీపీ నాయకుడొకరు ఆ స్థలం ఆక్రమించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. అప్పట్లో స్థానికులు అడ్డుకుని గొడవ పడడం రెవెన్యూ అధికారుల వద్దకు పోవడంలాంటివి చేయడంతో కొంత కాలం ఆక్రమణ ప్రయత్నం నిలుపుదల చేశారు. తిరిగి మళ్లీ ఇటీవల ఆ స్థలంలో కట్టడాన్ని ప్రారంభించేసరికి స్థానిక కాలనీవాసులందరూ అడ్డుకుని రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లగా, ప్రభుత్వ భూమి అంటూ అక్కడ ఓ బోర్డును కూడా నాటారు. అయినప్పటికీ వైసీపీ నాయకుడు ఆక్రమణ ప్రయత్నాన్ని ఆపలేదు. దీంతో కాలనీవాసులు ఐదురోజుల క్రితం సీతారామలక్ష్మణ విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేస్తుంటే హఠాత్తుగా గురువారం రాత్రి విగ్రహాలు మాయం కావడంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. విగ్రహాన్ని దొంగలించిన వారిపై కఠిన చర్యలు చేపట్టి తిరిగి విగ్రహాలను అదే స్థలంలో ప్రతిష్ఠింపజేయాలని స్థానిక కాలనీవాసులు, వీహెచ్‌పీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

మొల్ల అకాడమీ నెలకొల్పాలి

బద్వేలు, మార్చి 8: జిల్లాలో మహా కవయిత్రి మొల్లమాంబ పేరుతో తెలుగు అకాడమి నెలకొల్పాలని మొల్ల సాహితీపీఠ వ్యవస్థాపక అధ్యక్షుడు గానుగపెంట హనుమంతరావు పేర్కొన్నారు. మొల్ల సప్త శతాబ్ది ఉత్సవాలలో భాగంగా రెండో రోజు బద్వేలు పెన్షనర్స్ భవనం లో శుక్రవారం సభ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కమలమ్మ మాట్లాడుతూ గోపవరానికి మొల్ల పేరు పెట్టేందుకు, ఆమె పేరుతో కడపలో అకాడమీ ఏర్పాటుకు కృషిచేస్తానన్నారు. అనంతరం సాహి త్య, ఆధ్యాత్మిక, విద్యరంగాలలో సమాజ సేవ చేసిన పులివెందులకు చెందిన డాక్టర్ నాగేంద్రమ్మకు మొల్ల సాహితీ పురస్కారం, నగదు, జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో వైవీయూనివర్సిటీ పాలక మండలి సభ్యుడు కొండపల్లి చిన్న సుబ్బారావు, మొల్ల సాహితీపీఠ ప్రధాన కార్యదర్శి మనోజ్, పెన్షనర్స్ సంఘ బద్వేలు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మీనాక్షి రెడ్డి, కత్తి బ్రహ్మయ్య, గంగన్న, దంతవైద్యులు క్రిష్ణ, తదితరులు పాల్గొని అనంతరం మాజీ ఎమ్మెల్యే కమలమ్మను సత్కరించారు.

ప్రతి ఫిర్యాదు తీసుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ

పోరుమామిళ్ల, మార్చి 8 : పోలీసుస్టేషనుకు వచ్చే ప్రతి ఫిర్యాదును తప్పనిసరిగా స్వీకరించి బాధితులకు న్యాయం చేయాలని మైదుకూరు డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆయన పోరుమామిళ్ల పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి, సీఐ చిరంజీవికి సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం పోలీసుస్టేషన్ ఆవరణం పరిశీలించారు.

త్యాగానికి ప్రతిరూపం మహిళ

బద్వేలు టౌన్, మార్చి 8 : మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని ముస్లిం మైనార్టీ షేక్ మహబూబ్ బాషా (బిగ్‌బాస్), బద్వేలు మైనార్టీ అధ్యక్షుడు ఎస్ఎంబాషాలు అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మను గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకురాలు సుధారాణి, సునీత, జహంగీర్‌బాషా , సిమెంటు షరీఫ్, హుసేన్, ట్రావెల్స్ రసూల్, సిరాజ్, రామసుబ్బారెడ్డి, నాగభూషణం, హసన్, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: మహిళలు అన్నిరంగాల్లో రాణించినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే కమలమ్మ, కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయజ్యోతి అన్నారు. శుక్రవారం పోరుమామిళ్లలోని ఎస్టీయూ భవన్‌లో రీజనల్ కన్వీనరు క్రిష్ణారెడ్డి, కోకన్వీనరు రమణ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కాశినాయన ఎంపీపీ పోలమ్మ పోరుమామిళ్ల మాజీ జడ్పీటీసీ శారదమ్మ, ప్రభుత్వ వైద్యులు నాగలక్ష్మి, సబిత, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు శ్రీలత, రెడ్డిజ్యోతి, వివేకానంద సేవాశ్రమం నిర్వాహకురాలు రామతులసి, లావణ్య, ఆజ్ఞేసమ్మ, ఆసరా ఫౌండేషన్, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు అందరినీ సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు సుబ్రహ్మణ్యం, చంద్రహాసరెడ్డి, ఎస్సీ నాయకులు కుల్లాయప్ప, వెంకట్రామయ్య, వెంకటరెడ్డి, సిద్దారెడ్డి, శ్రీనివాసులు,సుబ్బారెడ్డి, ఆనంద్, బాషా పాల్గొన్నారు.

ఐద్వా సంఘం ఆధ్వర్యంలో..: పోరుమామిళ్లలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఐద్వా సంఘంలో జీబీనగర్ కాలనీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి గౌసియాబేగం మాట్లాడుతూ వ్యవసాయరంగంలో మహిళలే ముందున్నారన్నారు. అంతరిక్షరంగంలో అన్నిరంగాల్లో మహిళలు కృషి చేస్తున్నారన్నారు. లాయర్లుగా జడ్జి, ఎస్పీ, కలెక్టరుగా ఉన్నత స్థానాల్లో మహిళలు ఉన్నారని మహిళలకు 30 శాతం రిజర్వేషన్ ఇచ్చినా పర్సంటేజీ అమల్లో లేదన్నారు. బీబీ , లూర్దుమేరి, గురమ్మ పాల్గొన్నారు.

బద్వేలు..: మహిళలు అన్నిరంగాలలో రాణించాలని సీఐటీయూ నాయకులు శ్రీనివాసులు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక సుందరయ్య భవనంలో కేక్ కట్‌చేసి ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు మోక్షమ్మ, బాలమ్మ, వరలక్ష్మి, ఫాతిమా, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, తదితరులు పాల్గొన్నారు.



బద్వేలులో మాజీ ఎమ్మెల్యే విజయమ్మను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు